కంటి పరీక్షలు చేయించుకోవాలి

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విమల, ఎంపీడీఓ రవీంద్రనాథ్, పంచాయతీ కార్యదర్శి గౌస్, ఐకేపీ సీసీ మాధవి, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.


మహాముత్తారం: కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీడీఓ శంకర్‌నాయక్ శుక్రవారం సందర్శించారు. అనంతరం ఏన్కపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి వనసేవకులకు పలు సూచనలు చేశారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ ఏపీఓ రమేశ్, డాక్టర్ జగదీశ్ పాల్గొన్నారు.

కాటారం: మండలంలోని ధన్వాడలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి సంజీవ్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామంలో ఐకేపీ సీసీలు, ఆశవర్కర్లు, వీఓఏలు, వీఆర్ఏలు, అంగన్‌వాడీ టీచర్లు, రేషన్‌డీలర్లు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, సర్పంచ్ నరేశ్, మండల వైద్యాధికారి మౌనిక, ఎంపీఓ ఉపేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి పాల్గొన్నారు.


మహదేవపూర్: అంబట్‌పల్లిలో..


కాటారం: కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సంజీవరావు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన ఉమ్మగాని రమేశ్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. దీంతో ఆర్థిక సాయం కోసం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని కోరగా ఆయన స్పందించి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.60 వేల విలువ గల చెక్కును మంజూరు చేయించారు. ఈ మేరకు చెక్కును బీఆర్ఎస్‌పార్టీ నాయకుడు చింతల రమేశ్ బాధితుడికి అందజేశాడు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు పుల్లూరు సతీష్, జన్నే యుగందర్, కుమారస్వామి, పువ్వాటి హరికృష్ణ, కిరణ్, ఉప్పుల కిరణ్, రాయని శ్రీకాంత్, నర్సయ్య, రవీందర్, బాలకృష్ణ, రాజమల్లు, శ్రీదేవి, స్కైలాబ్, శంకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

మహాముత్తారం: మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు చిత్రపటానికి శుక్రవారం పెగడపల్లిలో రైతులు క్షీరాభిషేకం చేశారు. సాగు నీరు కోసం నాలుగు రోజుల క్రితం దేవాదుల ఎత్తిపోతల అధికారులతో మాట్లాడి మండలంలోని పోషంపల్లి పైప్‌లైన్ ద్వారా పెగడపల్లి, ప్రేమ్‌నగర్ చెరువుల్లోకి నీళ్లు తీసుకువచ్చి పంటసాగుకు సహకరించిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శారద, ప్రేమ్‌నగర్ సర్పంచ్ రమ్యబాయి, రైతులు దేశానాయక్, రాజునాయక్, కాంగ్రెస్ నాయకులు రామగిరి రాజయ్య, అమర్‌సింగ్, ఓంసింగ్, మధూకర్, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

మావోయిస్టులకు సహకరించొద్దు


మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు

ఎస్ఎస్ తాడ్వాయి: మావోయిస్టులకు సహకరించొద్దని ఎస్సై వెంకటేశ్వరరావు ఆదివాసీ గొత్తికోయలకు సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని భూపతిపూర్ గొత్తికోయగూడెంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గూడెంలోని గొత్తికోయ కుటుంబ వివరాలపై ఎస్సై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. గూడెంలోకి అపరిచితులను రానివ్వొద్దని సూచించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే సమాచారం అందించాలన్నారు. అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొత్తికోయలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్ వచ్చి పరిష్కరించుకోవాలని, పోలీస్ అధికారులు అన్ని సహాయ సహకారాలు అందిస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు


రెవెన్యూ సదస్సులో అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాత్రాపురం గ్రామంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సును నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అట్టం సత్యనారాయణ, తహసీల్దార్ అంటి నాగరాజు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి


భూపాలపల్లి రూరల్: అంబేడ్కర్ సెంటర్‌లో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


రేగొండలో..

భూపాలపల్లి రూరల్/చిట్యాల/పలిమెల/మొగుళ్లపల్లి/టేకుమట్ల(రేగొండ): మహిళా అని చూడకుండా గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌పై అసభ్య పదజాలంతో అవహేళన చేస్తూ మాట్లాడిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంతో పాటు పలు మండల కేంద్రాల్లో ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డి రాజకీయాలకు అనర్హుడని, వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే కౌశిక్‌రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలుతగిన గుణపాఠం చెబుతారన్నారు.


మొగుళ్లపల్లిలో..


చిట్యాలలో..

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం


సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కాటారం: మండల కేంద్రంలోని గారెపల్లి శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన వెనగంటి మల్లారెడ్డి రమాదేవి దంపతులు శుక్రవారం రూ.20వేలు విరాళంగా అందజేశారు. మల్లారెడ్డి దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. భక్తులు విరాళాలు అందజేసి ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తోట జనార్ధన్, ఆలయ కమిటీ సభ్యులు కొట్టె శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

ములుగు: విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని మల్లంపల్లి వెల్‌నెస్ సెంటర్ వైద్యుడు శ్రావణ్ సూచించారు. మండలంలోని జాకారం పరిధిలోని సోషల్ వెల్ఫేర్ గురుకులంలో రాయినిగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 85 మందికి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాదగిరి, వైస్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, గురుకుల వైద్యుడు బొట్ల ఆంజనేయులు, ఏఎన్ఎంలు తిరుమల, సుజాత, ఆశ కార్యకర్తలు కొత్తపల్లి రజిత, నషీమా ఉన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు శ్రావణ్

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

కాటారం: మన ఊరు–మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు సూచించారు. మండలంలోని గంగారం ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న పనులను ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులుతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 31లోగా పనులను పూర్తి చేయాలని సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్లకు తెలిపారు. గంగారం, ధన్వాడ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతతో కూడిన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఎంపీఓ ఉపేంద్రయ్య, సర్పంచ్‌లు తెప్పెల దేవేందర్‌రెడ్డి, నరేశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ

రెండు గంటల్లోనే ఆచూకీ..

- అలిగి ఇంటి నుంచి వెళ్లిన బాలిక
- వెంటనే స్పందించిన పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయింది. పోలీసులు సీసీ కెమెరాలు, ఆర్టీసీ అధికారుల సాయంతో రెండు గంటల్లో ఆచూకీ తెలుసుకున్నారు. ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరం నదీ తీరం వద్ద చేపలు పడుతూ జీవనం సాగిస్తున్న దరిపెల్లి శ్రీకాంత్ కుమార్తె కరోనా సమయం నుంచి బడి మానేసి ఇంట్లో ఉంటుంది. శుక్రవారం ఉదయం ఆమె సోదరుడు అజయ్ చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి అన్నం పెట్టమని అడగడంతో ఆ బాలిక పెట్టను అని చెప్పింది. దీంతో సోదరుడు ఎందుకు పెట్టవని బెదిరించడంతో అలిగి ఉదయం 10.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో బాలిక ఆచూకీ కోసం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గాలించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఏఎస్సై రాజేశం, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, కానిస్టేబుల్ బాల్‌సింగ్‌లు సీసీ కెమెరాలు పరిశీలించగా ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు కనిపించింది. వెంటనే భూపాలపల్లి ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డితో మాట్లాడారు. బస్సుల్లో వారి సిబ్బందితో వెతుకగా మధ్యాహ్నం 12.30 గంటలకు భూపాలపల్లి బస్టాండ్‌లో నిలిచిన హనుమకొండ బస్సులో బాలిక కనిపించింది. ఆ బాలికను వెంటనే కాళేశ్వరం పోలీసుస్టేషన్‌కు తీసుకు వచ్చి తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. త్వరగా స్పందించిన పోలీసులను పలువురు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న గోమాసే శ్రీనివాస్

మహదేవపూర్: మండలంలోని సూరారం గ్రామానికి చెందిన జవ్వాజి సమ్మయ్య ఇటీవల మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోమాసే శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు నాయకులు చల్లూరి మధు, జెడ్పీటీసీ గుడాల అరుణశ్రీనివాస్, ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకుడు బచ్చల ఎర్రయ్య, రాజమౌళి, రాజబాబు, రమేశ్, రాజేష్, భిక్షపతి, శ్రవణ్, బాపు, డోలి చంద్రయ్య, గోగుల నాగేందర్ తదితరులు ఉన్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి

మహదేవపూర్: తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని అంగన్‌వాడీ ఉద్యోగులు శుక్రవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చట్టం వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగుల జిల్లా అధ్యక్షురాలు జయప్రద, ఉద్యోగులు సత్యవతి, నిర్మల, ప్రమీల, స్వప్న, మహాలక్ష్మి, అజంత, సత్యవతి, చంద్రకళ, పద్మ, అన్నపూర్ణతోపాటు పలువురు ఉన్నారు.


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఏటూరునాగారం: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణిపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పద్మశాలీ సంఘం జిల్లా నాయకులు చిప్ప అశోక్, పోగుల లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు లింగాల మురళి అన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేస్తున్న ఆరోపణలు, వేధింపులకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వల్లనే శ్రావణి రాజీనామా చేయాల్సి వస్తోందని, సంజయ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పద్మశాలీ కుల బాంధవులు శ్రావణి వెంటనే ఉంటారని, ఆమెకు న్యాయం చేసే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి లొటపెటల రాజేష్, అలువాల శ్రీనివాస్ ఉన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

బీజేపీతోనే రాష్ట్రంలో సుపరిపాలన

కాటారం: బీజేపీతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీలో చేరారు. నూతనంగా చేరిన వారికి సునీల్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రధానమంత్రి మోదీ అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. మోదీ పాలనకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన వారు బీజేపీలో చేరుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిలో బొంతల రవి, సదానందం, రాజు, రమేశ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి, ఎంపీటీసీ ఉడుముల విజయరెడ్డి, గంట అంకయ్య, పూసాల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కాటారం: పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

బీజేపీలో పలువురు చేరిక

మహాముత్తారం: మండలంలోని గండికామారం రేగులగూడెం, స్థంబంపల్లి గ్రామాలకు చెందిన 50మంది యువకులు, రైతులు శుక్రవారం బీజేపీలో చేరారు. వీరికి బీజేపీ రాష్ట్ర నాయకుడు సునీల్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బహుమతుల ప్రదానం

మండలంలోని నల్లగుంటమీనాజీపేట గ్రామంలో రెండు రోజులుగా చందుపట్ల అనసూయమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు సునీల్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మండల అధ్యక్షుడు సంపత్, మండల ఇన్‌చార్జ్ దుర్గం తిరుపతి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి, అధికార ప్రతినిధి సందీప్‌రావు, శివ, దేవేందర్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శులు నవీన్‌నాయక్, శ్రీకాంత్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.


మహాముత్తారం: క్రీడాకారులకు నగదు అందజేస్తున్న సునీల్‌రెడ్డి

పోస్టల్ సేవలపై అవగాహన

కాటారం: తపాలాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పథకాలపై అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పోస్టల్ అధికారులు పోస్టల్‌సేవలపై విస్తృత ప్రచారం చేశారు. తపాలా సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీపీఎంలు కుడుదుల కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారులు

క్లుప్తంగా

కమిటీల ఎన్నిక



మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి, స్థంబంపల్లి గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ బూత్ కమిటీలను ఆ పార్టీ నాయకులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు మార్కరాము, ములుగుపల్లి సర్పంచ్ దూలం మల్లయ్య, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జాడి రాజబాపు, శేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదగాలి

టేకుమట్ల(రేగొండ): గ్రామాల్లోని రైతులు సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగవచ్చని మారి స్వచ్ఛంద సేవా సంస్థ ఐఎల్‌ఓ పర్యవేక్షణ అధికారి అపూర్వ అన్నారు. శుక్రవారం రేగొండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. సహకార సంఘాలతో రైతులు ఆర్థికంగా ఎదగడంతో పాటురైతులు పండించిన పంటలకు డిమాండ్ పెరుగుతుందని అన్నారు. అలాగే గ్రామాల్లో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని అందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ ప్రతినిధులు బత్తిని శ్రీనివాస్, అక్కల రమేశ్, చాంద్‌పాషా, మహేష్, తిరుపతి, సుజాత, రమాదేవి, దీప, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



కాటారం: మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని చల్లపల్లి గ్రామానికి చెందిన పాడి సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మేదరి సంఘం నాయకులు శుక్రవారం పరామర్శించి సంఘం ద్వారా రూ.6600 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గైని రమేశ్, మండల అధ్యక్షుడు పాడి రాజయ్య, మదిర రమేశ్, రాజేశ్వర్, మోహన్, సమ్మయ్య, శ్రీధర్, వేణుగోపాల్, వెంకటమ్మ, రాజేందర్, నరేందర్ పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రం ఏర్పాటు



వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి గ్రామంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఈడీఎమ్ దేవేందర్ ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 2015 సంవత్సరాని కంటే ముందు ఆధార్‌కార్డు దిగినవారు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

ఏఎస్పీని కలిసిన నాయకులు



ములుగు: పదోన్నతిపై మంచిర్యాల డీసీపీగా బదిలీ అయిన ఏఎస్పీ సుధీర్ ఆర్ కేకన్‌ను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయరాంనాయక్, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహేశ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బైకాని సాగర్, మాదం సాగర్, కొత్త కొండ రవి, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, చీరల పంపిణీ



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శ్రీ చైతన్య స్కూల్ ఆవరణంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో వితంతువులకు శుక్రవారం చీరలు, బియ్యం పంపిణీ చేశారు. 114 మందికి వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్ చేతల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మండల కోఆర్డినేటర్ ప్రేమ్‌రాజ్, పాస్టర్ కాల ప్రసాద్, నతానియల్, సత్యానందం, ప్రసాద్, కృపనిధి తదితరులు ఉన్నారు.